చురక

కొద్దిమంది చేతుల్లో
కేంద్రీకృత ఆర్థికం
పాలకులకు అదే నేడు
ప్రగతి పారమార్థికం.

పెరిగే అసమానత
పరుగుల్లో అభివృద్ధి
అవునన్నా కాదన్నా
అదే వాళ్ల లక్ష్యశుద్ధి



-వేల్పుల
నారాయణ

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్:బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 13-4-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:192 పేజీలు:6 వెల: రూ.1/-


## కవితను కోర్టులో ప్రవేశపెట్టిన సిబిఐ

న్యూఢిల్లీ ఏప్రిల్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ :: భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) నాయకురాలు కె.కవితను సిబిఐ కోర్టులో ప్రవేశపెట్టింది. ఆమెను ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ స్కామ్ కేసులో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కోర్టుకు సమర్పించిన తర్వాత ఆమెను ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని సిబిఐ కోరింది. కవితను ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడి) అరెస్టు చేశాక ఆమెను తీహార్ జైలులో ఉంచారు.కవిత తామడిగే ప్రశ్నలకు జవాబులు ఇవ్వకుండా సహకరించడంలేదంటూ సిబిఐ కోర్టుకు తెలిపింది.

కాగా కవిత తరఫు న్యాయవాది నితేశ్ రాణా, సిబిఐ వినతిని వ్యతిరేకించారు. ఆమె అరెస్టు అక్రమమని వాదించారు.సిబిఐ అధికారులు ఇటీవల స్పెషల్ కోర్టు అనుమతి తీసుకుని జైలులోనే ఇటీవల ప్రశ్నించారు. సహ-నిందితుడు బుచ్చి బాబు ఫోన్ నుంచి వాట్సాప్ ఛాట్ ను రికవర్ చేసి, దాని గురించే ఆమెను ప్రశ్నించారు. ఓ భూమి డీల్ కు సంబంధించిన డాక్యు మెంట్లు, తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి ఎక్సైజ్ పాలసీ ముడుపులుగా చెల్లించిన రూ. 100 కోట్ల మొత్తం విషయంలో కవితన వారు ప్రశ్నించారు.ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడి) మార్చి 15న బంజార హిల్స్ లోని కవిత(46) ఇంట్లోనే ఆమెను అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆమె జ్యూడిషియల్ కస్టడీలో ఉన్నారు.

# చొరబాటుదార్లకు స్వాగతం..

## అల్లరి మూకలకు ఆశ్రయం : కాంగ్రెస్ తీరుపై భగ్గుమన్న మోదీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: రాజస్థాన్‌లోని బార్మర్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచార ర్యాలీ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ చొరబాటుదార్లను స్వాగతించిందని, రాజస్థాన్‌లో రామనవమి ఊరేగింపుపై రాళ్లు విసిరిన అల్లరిమూకలకు ఆ పార్టీ ఆశ్రయం కల్పించిందని ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లిం లీగ్ ముద్రతో ముందుకొచ్చిందని మండిపడ్డారు. దేశ విభజనకు కారణమైన ముస్లిం లీగ్ ముద్ర కాంగ్రెస్ మేనిఫెస్టోపై ఉందని ఆరోపించారు. ఇండియా కూటమిలో మరో పార్టీ భారత అణ్వాయుధాలను తాము ధ్వంసం చేస్తామని మేనిఫెస్టోలో ప్రమాదకర డిక్లరేషన్‌ను పొందుపరిచిందని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. మన పొరుగున రెండు దేశాలు అణ్వాయుధాలను సమీకరిస్తే మనం మాత్రం మన అణ్వాయుధాలను ధ్వంసం చేయాలా అని ప్రశ్నించారు.

భారత్‌ను శక్తిహీనంగా తయారుచేయాలని కూటమి పార్టీలు కోరుకుంటున్నాయా అని ప్రధాని మోదీ నిలదీశారు. ఇక ఈ ర్యాలీలో రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో మేనిఫెస్టోలో 45 శాతం హామీలను నెరవేర్చామని చెప్పారు. రాజస్థాన్‌లో నీటి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

## 17న శ్రీరామనవమి శోభాయాత్ర.. ఏర్పాట్లపై నగర సీపీ సమీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 12:ఈ నెల 17వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా హైదరాబాద్‌లో శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహణపై పోలీసులు, వివిధ శాఖ అధికారులతో హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. గతేడాది జరిగిన పొరపాట్లు ఈసారి పునరావృతం కానివొద్దని సూచించారు. వేడుకల సమయంలో హైదరాబాద్‌లో మత సామరస్యం వెల్లివిరియాలన్నారు.

శ్రీరామనవమికి సమయం తక్కువగా ఉందని, అధికారులు సెలవు రోజుల్లో కూడా పని చేయాలని సీపీ ఆదేశించారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై చెత్త ఉండకుండా చూడాలని సూచించారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, బోనాలు, గణేశ్ ఉత్సవాలు, విజయదశమి పండుగల నిర్వహణలో హైదరాబాద్‌ను ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. వీలైనంత త్వరగా శోభా యాత్ర నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల కోడ్ ఉల్లంఘించకూడదని, ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయకూడదని హెచ్చరించారు.

# ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు

## – బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు



హైదరాబాద్ ఏప్రిల్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):రైతులు అమ్ముకునే ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులను మోసం చేసే మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లు, ట్రేడర్ల ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయాలన్నారు. కస్టమ్ మిల్లింగ్ నిలిపివేసి బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని ఆదేశించారు. సీఎంతో పాటు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నతాధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు తమ పరిధిలోని మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కనీస మద్దతు ధర అమలయ్యేలా చూడాలని, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడే పరిష్కరించాలని సూచించారు.కొన్ని చోట్ల తేమ ఎక్కువగా ఉందని చెప్పి వ్యాపారులు, మిల్లర్లు ధరలో కోత పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని సీఎం అన్నారు. అందుకే ధాన్యాన్ని మార్కెట్లకు తెచ్చే ముందు ఆరబెట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కల్లాల నుంచి ధాన్యాన్ని నేరుగా మార్కెట్లకు తరలిస్తే తేమ శాతం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ధాన్యం ఆరబెట్టేందుకు మార్కెట్ యార్డుల్లోనే తగిన ఏర్పాట్లు చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దొంగతనం వంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ఏ రోజుకారోజు రాష్ట్ర స్థాయి నుంచి పర్యవేక్షించాలని ఆదేశించారు. సంబంధిత విభాగాల అధికారులు పలు జిల్లాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించాలని సూచించారు.

### తాగునీటికి ఇబ్బంది లేకుండా..

ఉమ్మడి జిల్లాలకు నియమించిన ప్రత్యేక అధికారులు తాగునీటి ఇబ్బందులున్న చోటికి స్వయంగా వెళ్లి పరిశీలించాలి. సమస్యను పరిష్కరించే చర్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. హైదరాబాద్ లో తాగునీటి సరఫరాకు ఢోకా లేకుండా చర్యలు తీసుకోవాలి. డిమాండ్ మరింత పెరిగినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి. అవసరమైతే నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని హైదరాబాద్ కు తెచ్చుకోవాలి. కృష్ణా బేసిన్ లో నీటి లభ్యత లేనందున ఎగువన నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తాగునీటిని తెచ్చుకునేలా కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి. ఉద్దేశ పూర్వకంగా తాగునీటి సరఫరాకు ఆటంకం కల్పించిన వారిని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

### వారిపై ఫిర్యాదుకు చర్యలు..

తాగునీటి సరఫరాకు ఉమ్మడి జిల్లాలకు నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులు ధాన్యం కొనుగోళ్లను కూడా పర్యవేక్షించాలని సీఎం సూచించారు. వడగండ్ల వానలు వచ్చినా ఇబ్బంది లేకుండా అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల టైమ్ కావటంతో కొన్ని చోట్ల రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు తప్పుడు ఫిర్యాదులు, ఉద్దేశపూర్వక కథనాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. అటువంటి వాటిపై వెంటనే ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేయాలని సీఎం ఆదేశించారు.

### సమస్య పరిష్కారానికి కృషి..

రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ఎండల దృష్ట్యా రాబోయే రెండు నెలలు మరింత కీలకమని సీఎం అప్రమత్తం చేశారు. గతేడాదితో పోలిస్తే ఎక్కువ నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజల అవసరాలకు సరిపోవటం లేదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అప్పటి కంటే భూగర్భ జల మట్టం పడి పోవటంతో ప్రజలు కేవలం నల్లా నీటిపైనే ఆధారపడటంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఫిర్యాదుపై వెంటనే స్పందించి తాగునీటి సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని సూచించారు.

## తెలంగాణ ఏర్పాటును మోదీ అవమానించారు : మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఏప్రిల్ 12:తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రధాని మోదీ అవ మానించారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. విభజన చట్టంలోని హామీలను సైతం కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. మోదీ చెప్పిన ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు.బీజేపీ మత భావోద్వేగాలతో రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. మోదీ, అమిత్ షా కలిసి దేశంలోని నవరత్న సంస్థలను అమ్మారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నల్లసాగు చట్టాలు రైతుల ఆత్మ హత్యలకు కారణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.

## అభద్రతా భావంలో కూరుకుపోయిన రేవంత్ రెడ్డి - బీజేపీ ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్, ఏప్రిల్ 12:పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ కాంగ్రెస్‌లో, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డికి అభద్రతా భావం కలుగుతున్నదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. శుక్రవారం చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్రకార్యాలయంలో వారికి లక్ష్మణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కె.లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు.

వందరోజుల పాలనను రెఫరెండంగా భావించి ఓటు వేయాలని సీఎం గతంలో అనేక సార్లు చెప్పారని కె.లక్ష్మణ్ గుర్తు చేశారు. ఆరు గ్యారంటీల అమలుపై ఇప్పుడు ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత చూసి కాంగ్రెస్ మాట మారుస్తున్నదని విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే అన్ని గ్యారంటీలు నెరవేరుతాయని చెబుతున్నారని అన్నారు.

ఇది బోడి గుండుకు మోకాలికు ముడిపెట్టడమేనని ఎద్దేవా చేశారు. ప్రజల వ్యతిరేకతను దారి మళ్లించేందుకు తనపై కుట్ర జరుగుతున్నదంటూ సీఎం రేవంత్ రెడ్డి సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ పార్లమెంట్‌లో తమ అభ్యర్థి మాధవీలత ముచ్చెమటలు పట్టిస్తున్నదని, అందుకే ఓవైసీని గెలిపించడానికి కాంగ్రెస్ సిద్ధమైందని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి సొంత పార్టీలోనే పొసగడం లేదని, గతంలో మాటల తూటాలు పేల్చే రేవంత్ రెడ్డి ఇప్పుడు సానుభూతి మాటలు మాట్లాడటమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవాలని తాము కోరుకోవడం లేదని, అయితే ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీదే అధికారమని స్పష్టం చేశారు.

## రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో సూత్రధారి సహా ఇద్దరిని అరెస్టు

న్యూఢిల్లీ ఏప్రిల్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బెంగళూరు రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో సూత్రధారి సహా ఇద్దరిని జాతీయ నేర పరిశోధన శాఖ(ఎన్ఐఏ) అరెస్టు చేసిందని అధికారులు తెలిపారు. ముస్సవీర్ హుసైన్ షాజిబ్, అబ్దుల్ మతీన్ అహ్మద్ తాహా లు కోల్ కతాలో వారు దాగున్న ప్రదేశంలో ఎన్ఐఏ టీమ్ వారిని పట్టుకుందని అధికారులు తెలిపారు. బెంగళూరు కేఫ్ లో షాజిబ్ ఇంప్రోవైజ్డ్ ఎక్స్ ప్లోజివ్ డివైస్(ఐఈడి) పెట్టగా, ప్రణాళిక రచించింది, నిర్వహించిన కీలక సూత్రధారి మాత్రం తాహా అని వారు తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున తప్పించుకు తిరుగుతున్న వారిని, కోల్ కతా వద్ద వారు తప్పుడు ఐడెంటిటీతో దాగున్న ప్రదేశంలో వారిని ఎన్ఐఏ బృందం పట్టుకుంది. వారిని పట్టుకోవడంలో పశ్చిమ బెంగాల్, తెలంగాణ, కర్నాటక, కేరళ పోలీసులు ఎన్ఐఏకు సహకరించారని అధికారులు వెల్లడించారు. ఆ ఇద్దరి ఆచూకీ తెలిపితే వారిలో ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున రివార్డు కూడా ఇస్తామని ఎన్ఐఏ గత నెలలోనే ప్రకటించింది.

# సింహం బయటకొస్తే షూట్ చేసేస్తా! .బిఆర్ఎస్ నేతలకు రేవంత్ కౌంటర్

## –నా గురి అంతా సింహంపైనే రేపు రాత్రి 10 గంటలకు ప్రసారం

హైదరాబాద్, ఏప్రిల్ 12:సింహం బయటకు వస్తున్నదన్న బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.. ఓ టీవీ చానల్ నిర్వహించే ఫేమస్ టాక్ షో 'ఆప్ కీ అదాలత్' కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను సీఎం రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా షేర్ చేసుకున్నారు.

### రివేంజ్ తీసుకుంటున్నారా..

కేసీఆర్ సర్కారు మిమ్మల్ని జైలులో వేసినందుకు రివేంజ్ తీసుకుంటున్నారా? అని యాంకర్ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ రివేంజ్ ఇంకా స్టార్టే కాలేదని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలు తరచూ అంటున్నారు.. సింహం లోపల ఉంది బయటకు వస్తుంది.. అప్పుడు చూడండి అంటున్నారుగా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించగా.. రమ్మనండి పిస్టోల్‌తో రెడీగా ఉన్నాం.. ఒక్క తూటాతో అయిపోతుంది అని



ఘాటుగా రిప్లై ఇచ్చారు. తాను పిల్లిలు, కుక్కలను చంపనని.. చంపితే సింహాన్నే చంపుతానని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కాగా ఈ కార్యక్రమం రేపు రాత్రి 10 గంటలకు ప్రసారం కానుంది.

## వైసీపీ చేస్తున్న అభివృద్దిని కొనసాగించేలా ప్రజలు ఆశీర్వదించాలి : జగన్



అమరావతి, ఏప్రిల్ 12:గుంటూరు జిల్లాలో జరిగిన మేమంతా సిద్ధం సభలో చంద్రబాబుపై సీఎం జగన్ విమర్శలు గుప్పించారు. చంద్రబాబుకు ఓటేస్తే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయన్నారు. సింగపూర్ ను మించి అభివృద్ధి చేస్తామని బాబు చెప్పారు.. కానీ అభివృద్ధి జరిగిందా అని సీఎం జగన్ ప్రశ్నించారు. 2014లో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఈ కూటమి ఇంటింటికీ రంగుల మేనిఫెస్టోను పంపిణీ చేసి, ఆ హామీలను తుంగలో తొక్కిందని తీవ్రంగా విమర్శించారు.

గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం చేసిందని.. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి.. 99 శాతం హామీలను అమలు చేశామని సీఎం జగన్ అన్నారు. 2 లక్షల 70 వేల రూపాయలు నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రజలు రెండు సార్లు బటన్స్ నొక్కి వైసీపీని గెలిపించాలని జగన్ కోరారు. 58 నెలలుగా జరుగుతున్న అభివృద్ధిని కొనసాగించేలా ఆశీర్వదించాలని.. . ప్రజల ఆత్మ గౌరవాన్ని పెంచిన వైసీపీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి అని విజ్ఞప్తి చేశారు.

### నేటి కందం- నేటికీ అందం

కరివరవరదుని కృపతో
చరితకు పరవశము కలుగు సంభ్రమమున-భా
సురమతులు ప్రశంసించగ
కరిరాజును గనిరి యమెరికను లీవేళన్

( 13-4-1796 అమెరికనులు మొదటిసారిగా ఏనుగును చూచినరోజు.ఏనుగును ఆరోజుల్లో 450 డాలర్లకు కలకత్తానుండీ కొని అమెరికా తీసుకొని వెళ్ళారట. కేవలం ఏనుగును చూపించి ఆరోజుల్లో కోట్ల డాలర్లు సంపాదించి హోటల్ కట్టించాడట.ఇప్పటికీ ఆ హోటల్ ఉన్నది)



-రాధశ్రీ
సెల్:9494481210

## వైఎస్ షర్మిల పర్యటనలో ఉద్రిక్తత..

### –అడ్డుకున్న వైసీపీ శ్రేణులు

కడప జిల్లా ఏప్రిల్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల దూసుకెళ్తున్నారు. కడప లోక్ సభ స్థానం నుంచి బరిలోకి దిగడంతో ఆ నియోజకవర్గంపై ఎక్కువగా దృష్టిసారించారు. కడప లోక్ సభ నియోజకవర్గంలో పర్యటిస్తూ జనంలోకి వెళుతున్నారు. అధికార వైసీపీ నేతలకు షర్మిల పర్యటన కంటగింపుగా మారింది. షర్మిల శుక్రవారం నాడు లింగాల మండలానికి రాగానే అడ్డుకునే ప్రయత్నం చేశారు. షర్మిల పర్యటనను అడ్డుకోవాలని చూశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని చెదరగొట్టారు. అల్లరి చేసే వాళ్లు పులివెందుల రండి. పూల అంగళ్ళ వద్ద పంచాయితీ పెడదాం. వివేకాను ఎవరు హత్య చేశారో తేల్చుకుందాం అని షర్మిల కోరారు.

### ఓటమి భయం

వైసీపీ శ్రేణుల తీరును షర్మిల తప్పుపట్టారు. 'అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది. కడప లోక్ సభ స్థానం నుంచి బరిలోకి దిగిన అవినాష్ రెడ్డికి ఓటమి భయం ఉంది. తన పర్యటనకు అడ్డుపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ జెండాలను తీసివేస్తున్నారు. ఒకప్పుడు జగన్‌కి చెల్లెను కాను బిడ్డను.. సీఎం అయిన తర్వాత ఆ బంధం తెగింది. బాబాయిని చంపిన వాళ్ళను పక్కన పెట్టుకున్నారు. మళ్ళీ టిక్కెట్ ఇచ్చారు అని' షర్మిల మండిపడ్డారు.

### కోపం లేదు.. కానీ

'అవినాష్ రెడ్డి అంటే ఇదివరకు కోపం లేదు. వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డిని సీబీఐ హంతకుడని తేల్చింది. ఆధారాలు బయట పెట్టింది. హత్యకు పెద్ద ఎత్తున లావాదేవీలు నడిచాయి. అవినాష్ రెడ్డిని జగన్ కాపాడుతున్నారు. హంతకులకు జగన్ అండగా నిలబడ్డారు. అందుకే కడప ఎంపీగా బరిలోకి దిగా. న్యాయం, ధర్మం ఒక వైపు, అన్యాయం, హంతకులు మరో వైపు ఉన్నారు అని' వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.

# ఫూలే, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్నది కేసీఆర్ మాత్రమే : కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 12:దళిత, బహుజనల నాయకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ఆచరణలో చేసి చూపెడుతున్నది కేవలం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రమే అని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. విద్యతోనే వికాసం వస్తుంది. వికాసం నుంచి ప్రగతి వస్తుంది. ప్రగతి నుంచి సమాజంలో సమానత్వం వస్తుందని ఫూలే చెప్పారు. ఆ విధంగా అంబేద్కర్, ఫూలే మాటలను ఆచరణలో అమలు చేసింది కేసీఆర్ అని ఘంటా పథంగా చెప్పొచ్చు. 1008 గురుకుల పాఠశాలలను కేసీఆర్ స్థాపించారు. గురుకులాల్లో ఆరున్నర లక్షల మంది విద్యార్థులకు లక్షా 20 వేల చొప్పున ఖర్చు పెట్టి చదివించారు. ప్రపంచంతో పోటీ పడే పౌరులుగా గురుకుల విద్యార్థులను తీర్చిదిద్దారు.





విద్య మాత్రమే కాదు.. బీసీల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేశారు. రూ. 11 వేల కోట్లతో గొర్రెల పెంపకం అమలు చేశారు. మత్స్యకారులకు రూ. 30 వేల కోట్లతో మత్స్య సంపద సృష్టించారు. నేతన్నకు చేయూత, చేనేత మిత్ర లాంటి మంచి కార్యక్రమాలు తీసుకొచ్చారు.

చేతి వృత్తులకు, కులవృత్తులకు కేసీఆర్ అండగా నిలబడ్డారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కంటే ఎక్కువ బీసీలకు బీఆర్ఎస్ టికెట్లు ఇచ్చింది. మొత్తం 17 పార్లమెంట్ స్థానాల్లో ఐదు సీట్లు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించగా, మిగతా 12 సీట్లలో 6 సీట్లు బీసీలకు కేటాయించారు. ఇలా 50 శాతం సీట్లను బీసీలకు కేటాయించడం కేసీఆర్ వల్లే సాధ్యమైంది. ఫూలే జయంతి రాగానే దండేసి దండం పెట్టుడు వేరు. కానీ ఆయన ఆశయాలను కొనసాగించే విధంగా చేతల్లో చేసి చూపించిన ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ స్పష్టం చేశారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కేసీఆర్ ఆచరణలో పెట్టారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు, దళిత బంధు అమలు చేశారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పేరిట ఒక్కొక్క దళిత విద్యార్థికి రూ. 20 లక్షలు ఇచ్చి విదేశాల్లో చదువుకునేందుకు అండగా నిలబడ్డారు. ఈ దేశంలో దళితులకు ఇలా ఇంత వరకు ఎవరూ చేయలేదు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం ఇస్తున్నారు కేసీఆర్. మనందరం కలిసికట్టుగా క్యామ మల్లేష్‌ను గెలిపిద్దాం అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# చరిత్ర పుటల్లో రక్తంలో రాసిన నరమేధం..!

## (13 ఏప్రిల్ 'జలియన్‌వాలా భాఘ్ నరమేధ దుర్ఘటన దినం' సందర్భంగా)

మొదటి ప్రపంచ యుద్ధం (1914–18) ముగిసిన వేళలవి. యుద్ధం మిగిల్చిన క్షతగాత్రులు, అధిక ద్రవ్యోల్బణ దుస్థితి అనుభవంలోకి వచ్చిన రోజులవి. అధిక పన్నులు, అంటువ్యాధులతో సామాన్య ప్రజాజీవనం తల్లడిల్లిన సమయమది. ఐక్యకూటమిగా జాతీయోద్యమం తిరిగి పుంజుకున్న సందర్భమది. దాదాపు 13 లక్షల భారతీయ జవాన్లు విదేశాల్లో సేవలందించిన ఘడియలవి. దాదాపు 43,000 మంది భారతీయ సైనికులు అమరత్వం పొందిన కష్టకాలమది. భారతీయ జవాన్లలో బ్రిటీష్ వలసపాలన వ్యతిరేకంగా తిరుగుబాటు భావనలు రగులుతున్న సంధి కాలమది. భారత్‌లో స్వాతంత్ర్య పోరాట జ్వాలలు ఎగిసిన రోజులవి. రౌలట్ చట్టంతో తిరుగుబాట్లను అణచివేయడానికి, నిర్బంధించడానికి, అనుమానితుల్ని అరెస్టు చేయడానికి వైస్రాయ్‌లకు విశేష అధికారాలు కట్టబెట్టిన దుర్మార్గపు పాలన చూసిన వేళలవి.

### చరిత్రలో నిలిచిన నరమేధ ఉదంతం:

13 ఏప్రిల్ 1919 ఆదివారం రోజు భారత స్వాతంత్ర్య పోరాటంలోనే బ్రిటీష్ అధికారుల అమానవీయ, రాక్షస దుర్ఘటనగా జలియన్‌వాలా భాఘ్ నరమేధ ఉదంతం చరిత్రలో నిలిచి పోయింది. అమృత్‌సర్ స్వర్ణదేవాలయ సమీపాన ఉన్న జలియన్‌వాలా భాఘ్ పార్కులో జరిగిన సాయంకాల అహింసాయుత సమావేశంలో పాల్గొన్న దేశ పౌరులు, వైశాఖీ వేడుకల్లో నిరాయుధులైన ప్రజలు సంతోష సాగరంలో మునిగి ఉన్నారు. రౌలట్ చట్టానికి విరుద్ధంగా సమావేశం ఏర్పాటు చేశారనే ఆవేశంతో బ్రిగేడియర్–జనరల్ రెగినాల్డ్ డైయ్యర్ అనాలోచిత, అహంకారపూరిత ఆదేశంతో దాదాపు 50 మంది సాయుధ బ్రిటీష్ ఇండియన్ ఆర్మీ జవాన్లు ముందస్తు హెచ్చరికలు లేకుండా ఘోరమైన ఫైరింగ్ ప్రారంభించారు. ఈ విచక్షణారహిత, భయంకర 10 నిమిషాల కాల్పుల్లో పిల్లలు, స్త్రీలు, పురుషులు 379 మంది అమాయక పౌరులు, దేశభక్తులు ప్రాణాలు కోల్పోగా, 1,200లకు పైగా అమాయక ప్రజలు గాయపడటం జరిగింది. అమృత్‌సర్‌లో సమావేశాలను రద్దు చేశారనే జనరల్ డైయర్ ప్రకటన తెలియని అమాయకులు తమ సన్నిహితులైన దేశభక్తులు సత్యపాల్, సైఫుద్దీన్‌ల అరెస్టులను వ్యతిరేకిస్తూ జరుపతలపెట్టిన శాంతియుత సమావేశంతో పాటు పౌరులు వైశాఖీ పండుగను కూడా నిర్వహించదలిచారు. అకస్మాత్తుగా, దుర్మార్గంగా జరిగిన 1,650 రౌండ్ల ఆర్మీ ఫైరింగ్ నరమేధంలో వందలాది ప్రాణాలు గాల్లో కలవడం దేశవాసుల్లో ఆవేశాగ్నిని రగిల్చింది. భారత జాతీయ కాంగ్రేస్ వివరాల ప్రకారం ఈ నరమేధంలో 1,000కి పైగా అమరులుకాగా, 1,500 మందికి పైగా గాయపడ్డారని తెలిపారు.

### ఆవేశాన్ని రగిల్చిన దుర్ఘటన:

భారతీయ దేశభక్తులు ఈ దురంతానికి వ్యతిరేకంగా బ్రిటీష్ వలసపాలన అంతానికి సహాయ నిరాకరణోద్యమానికి నాంది పలికారు. షహీద్ భగత్ సింగ్‌లో విప్లవాగ్ని రగిల్చిన సంఘటనగా జలియన్‌వాలా భాఘ్ నిలిచింది. 1920లో జరిగిన ఈ దుర్ఘటన స్థలంలో స్మారక స్థూపాన్ని నిర్మించాలని భారత జాతీయ కాంగ్రేస్ తీర్మానించింది. 1961 ఏప్రిల్ 13న ఈ స్మారక స్థూపం అప్పటి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించబడింది. జనియన్‌వాలా భాఘ్‌లో నిరంతరాయంగా మండే అఖండ జ్వాలలు, భవన గోడలపై బులెట్ తగిలిన గుర్తులు, తోటలోని బావిలో దూకి మరణించిన జ్ఞాపకాలు నేడు చూపరులలో దేశభక్తిని, కర్తవ్యాన్ని జాగృతం చేస్తున్నాయనటంలో అతిశయోక్తి లేదు.

జలియన్‌వాలా భాఘ్ మారణకాండకు వందేళ్లు దాటింది. అయినా దేశభక్తి కలిగిన భారతీయులు ఈ దుర్ఘటనను ఇంకా మరిచి పోలేదు. బ్రిటీష్ పాలకుల దుశ్చర్యలో ప్రాణాలర్పించిన అమాయక ప్రజల త్యాగాల పునాదుల మీద స్వర్ణ భారతాన్ని నిర్మించడానికి అందరం కంకన బద్దులమవుదాం, అఖండ భారతదేశాన్ని అగ్రరాజ్యంగా రూపొందించుకుందాం.

జై హింద్, భారత్ మాతాకీ జై.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# అభివృద్ధి, సంక్షేమం టీడీపీ లక్ష్యం – భువనేశ్వరి

**–వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తిచేసేది చంద్రబాబే..**
**––వినుకొండ ప్రజలకు లోకేష్ ఇచ్చిన హామీ నెరవేరుతాయి**
**టీడీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు**
**–వినుకొండ నియోజకవర్గం పర్యటనలో భువనేశ్వరి వ్యాఖ్య**

అమరావతి, ఏప్రిల్ 12: వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తిచేసి పల్నాడు ప్రాంతంలోని ప్రజలకు సాగు, తాగునీరు చంద్రబాబే అందించగలరని నారా భువనేశ్వరి అన్నారు. వినుకొండ నియోజక వర్గంలో పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ ఈ ప్రాంతం ప్రజలకు వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తిచేస్తామని ఇచ్చిన హామీని తప్పని సరిగా నెరవేరుస్తారని తెలిపారు. వినుకొండ నియోజకవర్గం, బొల్లాపల్లి మండలం, రేమడిచర్ల గ్రామంలో నిజం గెలవాలి పర్యటన సందర్భంగా తనకు సంఘీంభావం తెలిపిన టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, గ్రామస్తులతో భువనేశ్వరి మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వాన్ని నమ్ముకున్న ప్రజలు పూర్తిగా మోసపోయారు. పేద ప్రజలకు కనీసం గుక్కెడు మంచినీళు కూడా ఇవ్వలేని దౌర్భాగ్యపు ప్రభుత్వం గత ఐదేళ్లుగా అధికారంలో ఉంది. అని భువనేశ్వరీ విమర్శించారు. వైసీపీ పాలనలో నిత్యావసరాల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్, కరెంటు ఛార్జీలు, ఆర్టీసీ ఛార్జీలు, పన్నులు పెరిగి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

చంద్రబాబు పాలనలో ఒక్కసారి కూడా కరెంటు ఛార్జీలు పెంచకుండా 24గంటలు కరెంటు ఇచ్చారని ,వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటినుండి మండు వేసవిలో రాష్ట్రాన్ని పూర్తిగా అంధకారంలో మగ్గబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తున్న ప్రజలు, ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై వైసీపీ గూండాలు, నాయకులు దాడులకు పాల్పడుతున్నారు.వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది..రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదు?ఏపీకి ఒక్క కంపెనీ కూడా రాలేదు. యువత నిరుద్యోగ సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వైసీపీ వేధింపులు తట్టుకోలేక కంపెనీలు ప్రక్క రాష్ట్రానికి పారిపోతున్నాయి?దీనివల్ల ఏపీలోని యువత ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడుతున్నారు.

### అభివృద్ధిని ధ్వంసం చేశారు

చంద్రబాబు కష్టపడి తెచ్చిన కంపెనీలను వైసీపీ నాయకులు కక్షకట్టి రాష్ట్రం నుండి తరిమేసి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. చంద్రబాబు 72శాతం పూర్తిచేసిన పోలవరం ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం కక్షకట్టి గోదావరిలో ముంచి నాశనం చేస్తోంది.వైసీపీ పాలనతో రాష్ట్ర ప్రజలు అన్ని విధాలా విసిగిపోయి ఉన్నారు ఇలాంటి దుర్మార్గపు పాలనను అంతం చేసే సమయం రాష్ట్ర ప్రజల చేతుల్లోకి వచ్చింది. అని భువనేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల కురుక్షేత్రంలో రాష్ట్ర ప్రజలు ఓటు అనే ఆయుధంతో వైసీపీ పాలనను అంతం చేయాలి.టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించడమే రాష్ట్ర ప్రజలు లక్ష్యంగా పెట్టుకోవాలి, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారు.వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలను కూడా తిరిగి పునరుద్ధరిస్తారు. అని భువనేశ్వరీ హామీ ఇచ్చారు.

# విద్యార్థులు ఆవేశ నిర్ణయాలు తీసుకోవద్దు..

**–ఫలితాల నేపథ్యంలో బోర్డు హితవు**
**–సప్లిమెంటరీలో మంచి ఫలితాలు సాధించండి**
**–పిల్లలను ఏమీ అనోద్దు**
**–వారిలో స్ఫూర్తిని నింపండి**

అమరావతి, ఏప్రిల్ 12:ఇంటర్ ఫలితాలను ప్రకటించిన సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఏపీ ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరబ్ గౌర్.. ఫెయిల్ అయ్యామని విద్యార్థుల బాధ పడొద్దు.. తొందరపాటు చర్యలకు పూనుకోవద్దు అని విజ్ఞప్తి చేశారు.. ఈ సారి కూడా బాలికల ఉత్తీర్ణత శాతం బాలుర కంటే ఎక్కువగా ఉందన్న ఆయన.. ఫెయిల్ అయిన స్టూడెంట్స్ తొందర పాటు చర్యలు వద్దు.. అంతేకాదు.. తల్లి తండ్రులు.. ఈ విషయంలో పిల్లలకు సపోర్ట్ చేయాలని సూచించారు..

ఫెయిల్ అయ్యారంటూ పిల్లలను అవమానించే విధంగా మాట్లాడొద్దన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు ఉన్నాయి.. ఈసారి బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.. ఇక, మే 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఏపీ ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరబ్ గౌర్ వెల్లడించారు..

# మొదటి విడత ఇవిఎం రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి- జిల్లా ఎన్నికల అధికారి




శ్రీకాకుళం, ఏప్రిల్ 12: మొదటి విడత ఈవీఎం రాండమైజేషన్ ప్రక్రియ నిర్దేశిత వెబ్ సైట్ లో పూర్తి అయిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జీలాని సమూన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఈ.యమ్.ఎస్ 2.ఓ నిర్దేశిత వెబ్ సైట్ లో మొదటి విడత ఇవిఎం రాండమైజేషన్ ప్రక్రియ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేసారు.

ఈ ప్రక్రియలో డీఆర్ఓ ఎం.గణపతి రావు, ఈవిఎంల నోడల్ అధికారిణి జిల్లా ఉపాధికల్పనాధికారుణి సుధా, సర్వశిక్ష అభియాన్ ఎ.పి.సి జయప్రకాశ్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

# జగన్ సమక్షంలో వైసీపీలో భారీగా చేరికలు..



అమరావతి, ఏప్రిల్ 12:ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సమయంలో రాజకీయ వలసలు కొనసాగుతూనే ఉన్నాయి.. ఓవైపు మేమంతా సిద్ధం పేరుతో బస్సు యాత్ర నిర్వహిస్తూ.. ముఖాముఖి కార్యక్రమాలు, రోడ్‌షోలు, బహిరంగ సభలతో ముందుకు సాగుతోన్న ఏపీ సీఎం, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. మరోవైపు వలసలపై దృష్టిసారించారు.. ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిలో ఉన్న అసంతృప్త నేతలను పిలిచి కండువా కప్పేస్తున్నారు.. ప్రతీరోజు ఏదో ఒక పార్టీ నుంచి నేతల వలసలు సాగుతూనే ఉండగా.. ఈ రోజు పల్నాడు జిల్లా ధూళిపాళ్లలో సీఎం జగన్ స్టేట్ పాయింట్ దగ్గర మరికొందరు కీలక నేతలు చేరారు. తెలుగుదేశం, బీజేపీ నుంచి వచ్చిన నేతలకు వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు సీఎం జగన్..

పల్నాడు జిల్లా ధూళిపాళ్ల నైట్ స్టే పాయింట్ వద్ద ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం, బీజేపీ నేతలు ఈరోజు వైయస్సార్‌సీపీలో చేరారు.. వారికి కండువాలు వేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు జగన్.. వారిలో ఆలూరు నియోజకవర్గం టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ మసాల పద్మజ.. కోడుమూరు నియోజకవర్గం టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి.. కోడుమూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కీలక నేత కోట్ల హరిచక్రపాణిరెడ్డి.. బీజేపీ నుంచి మాజీ మేయర్, ఆలూరు నియోజకవర్గ నేత కురువ శశికళ, ఆంధ్రప్రదేశ్ కురవ సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణమోహన్ తదితరలు ఈ రోజు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు..

ఆలూరు నుంచి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైకుంఠం మల్లిఖార్జున చౌదరి, చిప్పగిరి మాజీ ఎంపీపీ భీమలింగప్ప చౌదరి, నియోజకవర్గ నేత షీలాధరణ్, వాల్మీకి సంఘం సీనియర్ నేత, మాజీ జెడ్పీటీసీ దేవేంద్రప్ప, వలిగొంద మాజీ ఎంపీపీ సిద్ధప్ప తదితరలు వైసీపీలో చేరారు. వారితో పాటు.. వారి అనుచరులకు వైసీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు జగన్. ఈ కార్యక్రమంలో కర్నూలు వైయస్సార్‌సీపీ ఎంపి అభ్యర్థి బీవై రామయ్య, ప్రాంతీయ సమన్వయకర్త రామసుబ్బారెడ్డి, తదితర నేతలు పాల్గొన్నారు.

# జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలును పటిష్టంగా నిర్వహిస్తున్నాం-అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు

మెదక్, ఏప్రిల్ 12:శుక్రవారం రోజున క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హవేలీ ఘన్పూర్ మండల్ బూరుగుపల్లి , వడి, రాజుపేట, కొత్తపల్లి, గాజిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి ముందుగా గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు ఎటువంటి ఇబ్బందులు కలవకుండానీటి సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయిలో కొనుగోలు రైతులకు అందుబాటులోకి వచ్చాయని జిల్లాలో పండించిన వరి ధాన్యాన్ని ఎలాంటి ఆరోపణలు రాకుండా రైతుల నుండి సమయానికి కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. అన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వరిధాన్యం కోతకు వచ్చినందున ఆయా ప్రాంతాల్లో రైతుల నుండి వరిధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు.17 శాతం తేమశాతంపై రైతులకు అవగాహన కల్పించాలని, రైతులు నాణ్యత గల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి గిట్టుబాటు ధర పొందాలని, కొనుగోలు కేంద్రాలలో సరిపడినంతగా టార్పాలిన్లు, గన్ని బ్యాగులు సిద్ధంగా ఉంచుకోవాలని,వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పాలుపంచుకొనే అధికారులందరూ అప్రమత్తంగా ఉండి కొనుగోలుకు ఎలాంటి సమస్య రాకుండా చూడాలని ఒకవేళ కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్య తలెత్తితే వెంటనే తెలియ చేయాలని ఆదేశించారు.వరిధాన్యం కొనుగోలు బాధ్యత సంబంధిత శాఖలదేనని వివరించారు . ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, ఫ్యాక్స్ సీఈవో సాయి, సంబంధిత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగంపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు

మెదక్, ఏప్రిల్ 12:(నేటినిజం ప్రతినిధి):భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ ఎలక్ట్రోరల్ పాటిస్పేషన్ (స్వీప్)కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు వినియోగంపై, ప్రతి ఒక్కరికి తమ ఓటు విలువను తెలిపే విధంగా, గ్రామీణ & పట్టణ ప్రాంత ఓటర్లకు చైతన్యం కల్పించడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి కలకారులు లచే నిర్వహించడం జరుగుతుందనీ జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు ,నాలవవజూ నోడల్ అధికారి రాజిరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని . పగడ్బందీగా నిర్వహిస్తున్నారు . శుక్రవారం మెదక్ పట్టణం లో నర్సాపూర్ మున్సిపాలిటీ నర్సాపూర్ బస్టాండ్ చౌరస్తా .గ్రామంలో, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఓటు హక్కు పొంది ఉండాలి ఓటు హక్కు మన అందరి హక్కు అని, రాజ్యాంగం ద్వార కల్పించిన ఓటు హక్కును భారత దేశంలోనీ పౌరులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఓటర్ నమోదులో పేర్లు తప్పులున్న సరి చేసుకోవాలి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలి ప్రజలకు సాంస్కృతిక సారథి కళాకారులచే మాట పాటల ద్వారా వివరించారు కళాకారులు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓటర్లు విధిగా తమ ఓటు హక్కు వినియోగించుకొని రాజ్యాంగ బద్దంగా వ్యవహరించాలని ఆట పాటల ద్వారా కళ ప్రదర్శనను ఇచ్చి ప్రజలలో ఓటు హక్కు పై గొప్ప అవగాహనను పెంపొందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఎలా సిద్దులు టీం లీడర్ .బిట్ల ఎల్లయ్య, శివ్వోల్ల కృష్ణ కారంగుల మాధవి,టేక్మల్ విజయ లక్ష్మి. సందుల శేఖర్ జింక దేవదాస్ ఆస రామారావు తదితరులు పాల్గొన్నారు

# పంటలు ఎండుతున్నా పట్టించుకోని కాంగ్రెస్- జగదీష్ రెడ్డి

మెదక్, ఏప్రిల్ 12: కండ్ల ముందే నీళ్లు పోతున్నా ఇవ్వలేని కాంగ్రెస్ లీడర్లు తయారయ్యారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు, వైస్సార్ హయాంలోనూ నోరు మూసుకున్నది వారేనని మండిపడ్డారు. ఆరోగ్యం బాగాలేకున్నా రైతుల కోసం తిరుగుతున్న పోరాట యోధుడు కేసీఆర్ అన్నారు. జేబులో కతెర పెట్టుకునే వాడు జేబు దొంగనే అన్నారు. మంది లాగులు ఊడగొట్టి ఏమి చూస్తావు రేవంత్ రెడ్డి.. సీఎం అయింది దీని కోసమేనా అని ప్రశ్నించారు.

**జనరేటర్ కోసం మల్లీ లైన్లు**


ఇవ్వాళ జనరేటర్ కొనడానికి రైతులు బారులు తీరాల్సి వస్తుందని జగదీశ్‌రెడ్డి అన్నారు. మీరు చెప్పే మార్పు ఉన్నవి ఊడబీకడమా అని ప్రశ్నించారు. పదేళ్లలో ప్రభుత్వం ఏనాడైనా కేసులు పెట్టమని చెప్పామా అన్నారు. ఎవరి కోసం ఏ స్కీమ్ పెడదాం అని ఆలోచించాం.. కానీ వీళ్లు పొద్దున్న లేస్తే దొంగ మాటలే అని మండిపడ్డారు. సీఎం రేవంత్ లాగానే మంత్రి ఉత్తమ్ కూడా ప్రగల్బాలు పలుకుతున్నారన్నారు. 60ఎండ్ల దుర్మార్గం పాలన చేస్తే ఫ్లోరోసిస్ అవతరించిందన్నారు. కేసీఆర్ ఫ్లోరైడ్ ను పారదోలారన్నారు. ఆనాడు నల్లగొండలో 3 నుంచి 4 లక్షల టన్నుల ధాన్యమే పండగా.. నేడు 40 లక్షల ధాన్యం పండించి దేశానికి నల్లగొండ ధాన్యగారవైందన్నారు. ఓటు వేయించుకుని అబద్దపు పాలన చేస్తున్నారన్నారు. 420 హామీలు ఇచ్చి మోసం చేస్తున్నారన్నారు.

**ఆరు గ్యారెంటీలు ఏమైనయ్...**


డిసెంబర్ 9 నుంచి ఇస్తానన్న ఆరు గ్యారంటీ లు ఎటూ పోయాయి.. రైతుబంధు రూ.15 వేలు ఎటూ పోయాయని జగదీశ్?రెడ్డి ప్రశ్నించారు. అన్ని పంటలకు ఇస్తానన్న రూ.500లు బోనస్ ఎటూ పోయే.. కాంగ్రెస్ హామీలు అడిగితే కేసీఆర్ నూ బొంద పెట్టాలి అంటున్నారన్నారు. రుణమాఫీ అడిగితే బెదిరిస్తున్నారన్నారు. మాట ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలన్నారు. కేసీఆర్ ఎప్పుడైనా చేయగలిగిందే చెప్పాడు.. చెప్పిందే అమలు చేసి చూపించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అక్రమ కేసులు పెడుతున్నారు.. బీఆరెస్ కార్యకర్తలనూ వేదిస్తే ఊరుకోమన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపు మాటలనూ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

# సమస్యలపై స్పందించే వారినే ఎన్నుకోవాలి.. నటుడు సుమన్

అమరావతి, ఏప్రిల్ 12: జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సెక్యులర్ పార్టీలుగా వ్యవహరించడం లేదని హీరో సుమన్ తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. శుక్రవారం సినిమా షూటింగ్ సందర్భంగా విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ పార్టీ అయిన బీజేపీ పేరుకు సెక్యులర్ పార్టీ అని చెప్పుకుంటున్నా హిందుత్వ నిదానంతో తక్కిన మతాలకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేకపోతుందన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీలకు, క్రిస్టియన్ మైనార్టీలకు ఇచ్చే ప్రాధాన్యత హిందువులకు ఇవ్వడం లేదన్న వాదనలు ఉన్నాయంటూ ఆయన స్పష్టం చేశారు. అయినా ఇది పూర్తిగా తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. నిజానికి నాయకులు ఒక పార్టీని నమ్ముకుని రాజకీయం చేయడం లేదని కేవలం డబ్బు, అధికారం కోసమే పనిచేస్తున్నారని, అలాంటి రాజకీయాలు ప్రజలకు ఏమాత్రం మేలు చేయవన్నారు.ప్రజలు కూడా తమ నాయకుడిని ఎన్నుకునే విషయంలో తమకు ఏ సమస్య వచ్చినా స్పందించగలిగే నాయకుడి వెంటే నడవాలి తప్ప కేవలం ఎన్నికల సమయంలో ఇచ్చే తాయిలాలు ఆశించి పనిచేయకూడదని, అలాంటి పద్ధతి సరైంది కాదని ఆయన సూచించారు. ముఖ్యంగా తమకు వ్యవసాయ రంగంలో, విద్యారంగంలో, వైద్యరంగంలో మేలు చేయగలిగే శక్తి కలిగిన నాయకుడిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సినిమా వాళ్ళ విషయానికొస్తే వారు కూడా ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా గెలిచి మంత్రులు కూడా అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకు రోజాయే తార్కాణం అన్నారు. ఇక ముఖ్యమంత్రి విషయానికొస్తే ప్రజల మంచి కోరి ప్రజల విషయాలను దృష్టిలో ఉంచుకొని పరిపాలన కొనసాగించే వారిని ఆదరించడమే సరైనటువంటి ధర్మం అని ఆయన అన్నారు. నిజానికి పక్ష పార్టీలు విధానమే సరైందని, కానీ వారు కేవలం ప్రజా సమస్యల పోరాటంలోని నిండిపోయారని ఆయన అన్నారు. అందుకే ఓటరుగా నాయకుడిని ఎన్నుకునే సమయంలో ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవడం మంచిదన్నారు.



# ఏపీ ఇంటర్ ఫలితాలు.. ఫస్టియర్‌లో 67 శాతం, సెకండియర్‌లో 78 శాతం ఉత్తీర్ణత




అమరావతి, ఏప్రిల్ 12:ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ విద్యా కార్యాలయంలో ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్‌లో 67 శాతం మంది ఉత్తీర్ణులవగా, రెండో సంవత్సరంలో 78 శాతం ఉత్తీర్ణత నమోదయింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో 84 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లా మొదటి స్థానంలో నిలువగా, 81 శాతంతో గుంటూరు, 79 శాతంతో ఎన్టీఆర్ జిల్లా మూడో స్థానంలో ఉంది. ఇక సెకండియర్ ఫలితాల్లో 90 శాతంతో కృష్ణా జిల్లా ప్రథమస్థానంలో ఉండగా, 87 శాతంతో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు ద్వితీయస్థానం, 84 శాతంతో విశాఖ జిల్లాకు తృతీయస్థానంలో నిలిచింది.కాగా, ఏపీలో ఇంటర్ పరీక్షలు మార్చి 1 నుంచి 20 వరకు జరిగిన విషయం తెలిసిందే. ప్రథమ సంవత్సరానికి సంబంధించి 5,17,617, ద్వితీయ సంవత్సరం 5,35,056 మంది పరీక్ష ఫీజు చెల్లించగా.. వీరిలో 9,99,698 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ముగిసిన 22 రోజుల వ్యవధిలోనే ఫలితాలను విడుదల చేశారు. కాగా, ఫలితాలను ఇంటర్‌బోర్డ్ అధికారిక వెబ్‌సైట్ https://resultsbie.ap.gov.in లో చూడవచ్చు.

# నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం, ఏప్రిల్ 12: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శనివారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఉదయం 10గంటలకు తిరుమలాయపాలెం మండలం హైదర్ సాయిపేటలో జరిగే శ్రీశ్రీశ్రీ లింగా బస్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్స వంలో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 01.00గంట వరకు కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, మధ్యాహ్నం 03.30గంటల నుంచి సాయంత్రం 06.00గంటల వరకు కొత్తగూడెం విద్యానగర్ లోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై మంత్రి పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# కాంగ్రెస్ వచ్చింది.. కష్టాలు తెచ్చింది

**-ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**

**-గెలిపిస్తే పార్లమెంటులో తెలంగాణ గళం వినిపిస్తా**

**-ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి**

హైదరాబాద్, ఏప్రిల్ 12:కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కరెంటు, మంచినీటి కష్టాలు తెచ్చిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ ఇండ్లలో మూలన పెట్టిన ఇన్‌వర్టర్లు, జనరేటర్లను రెడీ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాటాడుతూ మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో బీఆర్ఎస్ జెండా ఎగురడం ఖాయమని, ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు తథ్యమన్నారు.

ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని అందించాలని కోరారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులంతా ఇంటింటికీ ప్రచారం చేసి.. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి భారీ మెజార్టీని అందించాలన్నారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా మాట్లాడుతూ నియోజకవర్గంలోని శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన రీతిలోనే



పార్లమెంటు ఎన్నికల్లోనూ పనిచేయాలన్నారు.

ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తాను స్థానికుడినని, అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని, బీఆర్ఎస్ అభ్యర్థిగా తనను గెలిపిస్తే పార్లమెంటులో తెలంగాణ గళం వినిపిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు జీవీ సాగర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వివిధ డివిజన్ల అధ్యక్షులు లింగాల రాహుల్ గౌడ్, జక్కల శ్రీశైలం యాదవ్, తోట మహేశ్ యాదవ్, నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వర్‌రావు, గజ్జల మధుసూదన్‌రెడ్డి, జోగు రాములు, సొంటి చంద్రశేఖర్‌రెడ్డి, పులిపాటి త్రివేది తదితరులు పాల్గొన్నారు.

# జీవన సంధ్య వృద్ధాశ్రమంను సందర్శించిన కాంగ్రెస్ నేత

**- తల్లిదండ్రుల రుణం ఏమిచ్చినా తీర్చుకోలేం..**

**- ఆర్థిక సాయం అందజేసిన పరికపల్లి**

ఖమ్మం, ఏప్రిల్ 12: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలో జీవన సంధ్య వృద్ధాశ్రమంను సందర్శించి పలువురిని పరామర్శించి కొంత



ఆర్థిక సహాయం అందించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జన్మ జన్మల బంధం తల్లిదండ్రుల బంధం తల్లిదండ్రులు నవ మాసాలు మోసి జన్మనిచ్చి, పోషించిన తల్లిదండ్రుల రుణము ఏమిచ్చినా తీర్చుకోలేం... ఏప్పటికీ మర్చిపోలేం...అలాంటి తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న కొడుకులు, కూతుర్లు జన్మనిచ్చిన తల్లిదండ్రులను పట్టించుకోకుండా వృద్ధాశ్రమంలో వదిలేసి వెళుతున్న కసాయి కొడుకులు, కూతుర్లు అని బాధపడుతూ కంటతడి పెట్టుకున్నారు. ఆశ్రమంలో ఉంటున్న కోదుమూరు నాగ వెంకటేశ్వరావుని, పలువురిని పరామర్శించి వారికి మనోధైర్యాన్నిచ్చి అండగా ఉంటామని హామీనిస్తూ పండ్లు,ఆర్థిక సహాయం అందజేశారు.

# డైనోసార్ల మాదిరిగా కాంగ్రెస్ అంతరించి పోతుంది

**-రాజ్‌నాథ్ సింగ్**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. డైనోసార్‌ల మాదిరిగా ఆ పార్టీ అంతరించి పోతుందని అన్నారు. అందుకే కాంగ్రెస్ నేతలు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరుతున్నారని చెప్పారు. ఉత్తరాఖండ్‌లో పౌరి స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి అనిల్ బలూనీకి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అంతరించిపోతుందని హెచ్చరించారు. 'కాంగ్రెస్ నుంచి నేతల వలసలు కొనసాగుతున్నాయి. ఒకరి తర్వాత ఒకరు పార్టీని వీడి బీజేపీలో చేరుతున్నారు. కొన్నేళ్లలో డైనోసార్‌లా కాంగ్రెస్ కూడా అంతరించిపోతుందేమోనని నేను భయపడుతున్నా' అని అన్నారు.

కాగా, కాంగ్రెస్ పార్టీని బిగ్ బాస్ హౌస్‌గా రాజ్‌నాథ్ సింగ్ పోల్చారు. 'వారు (కాంగ్రెస్ నేతలు) రోజూ ఒకరితో ఒకరు గొడవ పడుతున్నారు. ఆ పార్టీ కాస్త బుల్లితెరపై బిగ్ బాస్ ఇల్లులా మారిపోయింది. రోజూ ఒకరి బట్టలు ఒకరు చించుకుంటున్నారు' అని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీని పిల్లలు కూడా గుర్తించలేరని ఎద్దేవా చేశారు.

# ఫొటో జర్నలిస్టు నర్రా రాజేష్ కుటుంబానికి అండగా ఉంటాం : కె శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 12:యువ ఫొటో జర్నలిస్ట్ నర్రా రాజేష్ ఆకస్మిక మరణం అత్యంత విషాదకరమని, అతని కుటుంబానికి తాము అండగా ఉంటామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం నాడు బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజేష్ సంస్మరణ సభ నిర్వహించారు. అసోసియేషన్ నుండి బాధిత కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కే శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.

ఆయా పత్రికల్లో ఫొటో జర్నలిస్టుగా సేవలందించిన రాజేష్, ఎంతో బాధ్యతగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించాడని ఆయన కొనియాడారు. మీడియాకు ఫొటో జర్నలిస్టులు కళ్ళు, చెవుల లాంటి వారన్నారు. పత్రికల్లో వార్తలకు సాక్ష్యంగా నిలిచేది ఫొటోలేనని, ఆ ఫొటోల కోసం ఫొటో జర్నలిస్టులు పడే తిప్పలు వర్ణనాతీతమని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పాత్రికేయ వృత్తి అభద్రతా, అత్యంత ప్రమాదకరమైనట్లు ప్రజాస్వామిక దేశాలకు ఐక్యరాజ్య సమితి ఎప్పుడో సూచించిందని ఆయన గుర్తుచేశారు. ఫొటో, వీడియో



జర్నలిస్టుల ఆరోగ్య భద్రత పై మీడియా సంస్థల యాజమాన్యాలు దృష్టి సారించాలని ఆయన సూచించారు.

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె విరాహత్ అలీ మాట్లాడుతూ.. ప్రాణాలను ఫణంగా పెట్టి మీడియా రంగంలో వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్న ఫొటో, వీడియో జర్నలిస్టుల జీవితాలు అంధకారంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో లాఠీలను, తూటాలను, కేసులను లెక్కజేయకుండా ఫొటో జర్నలిస్టులు పోషించిన సాహసవంతమైన పాత్ర అభినందనీయమన్నారు. ఫొటో, వీడియో జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం తమ సంఘం నాటి నుండి నేటివరకు అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఎప్పుడూ చిరునవ్వులతో పలకరించే రాజేష్ ఆకస్మిక మృతి తమను ఎంతో కలచివేసిందని, అతని కుటుంబానికి చేయూతనిస్తామని విరాహత్ అన్నారు.

హెచ్‌యూజే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. రాజేష్ మృతితో తమ సంఘం క్రియాశీలక సభ్యుడిని కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి హరి, జేఎన్‌జేహెచ్‌ఎస్ అధ్యక్షులు బి.కిరణ్ కుమార్, రాజేష్ భార్య లావణ్యతో పాటు ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మీ ఆడబిడ్డను.. ఆశీర్వదించండి .. పులివెందుల ప్రజలకు షర్మిల విజ్ఞప్తి

**-మీ రాజన్న బిడ్డను గెలిపించండి**

**-లింగాల మండల కేంద్రంలో ఉద్రిక్తత**

**-పర్యటనను అడ్డుకున్న వైసిపి కార్యకర్తలు**

**-స్పందించిన పోలీసులు.. అక్కడ నుంచి తరిమివేత**

అమరావతి, ఏప్రిల్ 12: ఏపీసీసీ చీఫ్, కడప ఎంపీ అభ్యర్థి షర్మిల రెడ్డి తన సొంత గడ్డ పులివెందులలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మూడు రోజుల విరామం అనంతరం శుక్రవారం వైఎస్ వివేకానంద రెడ్డి తనయ సునీత రెడ్డి వెంట రాగా పులివెందుల నియోజకవర్గం వేంపల్లి నుంచి ఆమె బస్సు యాత్ర ప్రారంభమైంది. వేంపల్లి పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఇది నా సొంత గడ్డ. దివంగత నేత రాజశేఖర్ రెడ్డి, వివేకానంద రెడ్డిని ఆశీర్వదించిన మీకు చేతులెత్తి నమస్కరిస్తున్న. నేను మీ బిడ్డను. మీ ఇంటి ఆడపడుచును. వచ్చే ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాను. నన్ను ఆశీర్వదించండి అని షర్మిలా చేతులెత్తి నమస్కరించారు.

### చిన్నాన్నను దారుణంగా చంపేశారు..

మా చిన్నాన్న వివేకానంద రెడ్డిని దారుణంగా హత్య చేశారు. హత్య చేసిన వాళ్లు ఎవరు?.. చేయించింది ఎవరు?.. మీకు తెలుసు. హత్య జరిగి ఐదేళ్లు అవుతున్నా నిందితులకు ఎటువంటి శిక్షలు పడలేదు. దర్జాగా తిరుగుతున్నారు. వారిని ఎవరు



కాపాడుతున్నారో మీకు తెలుసు. ప్రజలు ఓట్లు వేస్తే కనీసం కృతజ్ఞత లేదు. జగన్‌కు ఓట్లు వేసి గెలిపించేది హత్యలు చేయించడానికా? అని షర్మిల ప్రశ్నించారు. ఇక్కడే ఇంత అన్యాయం జరుగుతుంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు.

### అభివృద్ధి లేదు.. అక్రమార్జనే

రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి అన్నది లేదు. ప్రత్యేక హోదా లేదు.. పోలవరం పూర్తి కాలేదు.. కడప స్టీల్ ఫ్యాక్టరీ అతి గతి లేదు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమాలు, దౌర్జన్యాలు చేస్తూ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. చిన్నాన్న వివేకను హత్య చేసిన నిందితులు యథేచ్ఛగా బయట తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని దర్జాగా తిరుగుతున్నారన్నారు. వివేకా హత్య కేసులో అన్ని ఆధారాలు ఉన్నా చర్యలు లేవని చెప్పారు. సీబీఐ ఎంపీ అవినాష్ రెడ్డిని నిందితుడని చెప్పిందని మరీ చర్యలేందుకు తీసుకోలేదని నిలదీశారు. అలాంటి వ్యక్తికే ఈ ఎన్నికల్లో మళ్లీ జగన్ టిక్కెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఇది హత్యా రాజకీయాలను ప్రోత్సహించినట్లేనని చెప్పారు. హత్య చేసిన నిందితులను గెలిపించాలని జగన్ చూస్తున్నారన్నారు. వివేకా స్వయానా జగన్‌కి బాబాయి అవుతారని.. ఈ హత్యపై కనీసం న్యాయం చేసే పరిస్థితి లేదని వైఎస్ షర్మిలా మండిపడ్డారు.

### మీ రాజన్న బిడ్డను గెలిపించండి

నిందితులను దగ్గరుండి మరీ కాపాడుతున్నారని, ఇలాంటి నిందితులు చట్టసభల్లో అడుగుపెట్టవద్దని అన్నారు. సునీతాకు తాను అండగా నిలబడ్డానని చెప్పారు. అందుకే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కడప స్థానం నుంచి పోటీ చేస్తున్నాను. న్యాయం ఒకవైపు, అధర్మం ఒక వైపు ఉందన్నారు. వైఎస్ బిడ్డ ఒక వైపు ..వివేకాను హత్య చేసిన నిందితుడు ఇంకొవైపు ఉన్నారని చెప్పారు. ఒకవైపు ధర్మం, మరో వైపు అధికారం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఎవరిని గెలిపించాలో ఆలోచించాలని వైఎస్ షర్మిల అన్నారు. మీ ఆడబిడ్డను. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాను. ఆశీర్వదించండి. మీ రాజన్న బిడ్డను గెలిపించండి అంటూ నియోజకవర్గ ప్రజలకు షర్మిల విజ్ఞప్తి చేశారు.

### వీళ్లు చట్టసభలకు వెళ్లకూడదు: సునీత

వివేకానంద రెడ్డి తనయ సునీత రెడ్డి మాట్లాడుతూ.. నాన్న వివేకానంద రెడ్డి హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న వీరు మరోసారి చట్ట సభలకు వెళ్లకూడదన్నారు. అకారాన్ని అడ్డం పెట్టుకొని ఇటువంటి శిక్షలు అనుభవించకుండా సమాజంలో దర్జాగా తిరుగుతున్నారని అటువంటి వారిని, వారికి మద్దతు ఇచ్చే వారిని కూడా ఓడించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పీసీసీ మీడియా చైర్మన్ ఎన్ తులసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్ షర్మిలా రెడ్డి ఎన్నికల ప్రచారం పులివెందుల నియోజకవర్గంలోని వేముల, సింహాద్రిపురం, పులివెందుల మీదుగా సాగుతోంది. పులివెందుల ప్రజల నుంచి ఆమె ఒక మంచి స్పందన లభిస్తోంది.

### లింగాల మండల కేంద్రంలో ఉద్రిక్తత

షర్మిల పర్యటన లింగాల మండలం చేరుకున్న సందర్భంగా కొందరు వైసిపి కార్యకర్తలు అడ్డుకున్నారు.. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సకాలంలో స్పందించిన పోలీసులు వారిని అక్కడ నుంచి తరిమివేశారు.

# హనుమకొండలో దారుణం.. మహిళ కాళ్లపై నుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు

వరంగల్, ఏప్రిల్ 12: హనుమకొండ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఓ మహిళ కాళ్లపై నుంచి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మహిళ రెండు కాళు విరిగిపోయాయి. ఈ విషాదకర సంఘటన శుక్రవారం హనుమకొండ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన మహిళ హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన కావటి రాజక్క (48)గా గుర్తించారు.

గుర్తించిన స్థానికులు వెంటనే ఆమెను దవాఖానకు తరలించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న బీజేపీని ఓడించాలి

మెదక్, ఏప్రిల్ 12: బీజేపీ అధికారంలోకి వొస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మారుస్తా అంటున్నారు.

అలాంటి వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కౌడిపల్లిలో జరిగిన కౌడిపల్లి, చిలిపిచెడ్, కుల్చారం మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి మాట్లాడారు.

మెదక్ గడ్డ కేసీఆర్ అడ్డా అని, ఎవరు అడ్డొచ్చినా బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు.

దేవుని మీద రాజకీయం చేయడం బీజేపీకే చెల్లిందని విమర్శించరాఉ. రఘునందన్ రావు మాయ మాటలు నమ్మని దుబ్బాక ప్రజలు చిత్తుగా ఓడించారన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారం టీలు బుట్ట దాఖలు అయ్యాయని, కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలన్నారు.

కౌడిపల్లి మండలంలో పార్టీ శ్రేణులకు కొదువ లేదని, మీకు అండగా నిలుస్తామన్నారు. పార్టీని వీడి పోయే వారు పోతారని, ఉన్నవాల్లే నిజమైన కార్యకర్తలలని పేర్కొన్నారు. తాను పార్టీ మారుతారని దుష్ప్రచారం చేస్తున్నారని, కేసీఆర్ అడుగులో అడుగై ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. వెంకట్రామరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

# ఈ ఏడాది జోరు వానలు .. ముందుగానే రుతుపవనాలు

**-ఎల్‌నినో ప్రభావానికి బ్రేక్**

**-హిందూ మహాసాగరంలో లానినో**

**-ఒక్కసారిగా చల్ల బడుతున్న వాతవరణం**

**-జూన్ రెండో వారం నుంచే జోరుగా వానలు**

**-సెప్టెంబర్ వరకు దంచికొట్టనున్నాయి**

**-అన్నదాతలకు వాతావరణ శాఖ తీపి కబురు**

హైదరాబాద్, ఏప్రిల్ 12:గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. పంటలు పండించేందుకు సరిపడా నీరు లేక కష్టాలను అనుభవించారు. ఎల్?నినో ప్రభావంతో దేశమంతా కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కొన్నిచోట్ల



నోటికాడికి వచ్చిన పంటలు నీటి ఎద్దడితో ఎండిపోయి పశువులకు మేతగా మారాయి. దీంతో వ్యవసాయమే వృత్తిగా జీవిస్తున్న రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు తీపి ఇండియన్ మెట్రలాజికల్ డిపార్ట్ మెంట్ (ఐఎండీ) కబురు తీసుకొచ్చింది. ఈసారి ముందుగానే రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నట్లు శుక్రవారం వెల్లడించింది. అంతే కాకుండా ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురుస్తా యని చల్లని కబురును అందించింది.

ఈ ఏడాది రుతుపవనాలు కాస్త ముందుగానే వచ్చే అవకాశమున్నట్టు ఐఎండీ అధికారులు తెలిపారు. ఎన్నడూలేని విధంగా ఈసారి హిందూ మహాసముద్రం డైపోల్ (ఐఓడీ), లానినా పరిస్థితులు ఏకకాలంలో క్రియాశీలకం కానుండటంతో వర్షపాతం కూడా అధికంగా నమోదయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. హిందూ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉండకపోవడాన్ని (ఐఓడీ) అని, మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల సగటు ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా చల్లాగా మారటాన్ని లానినా అని అంటారు. ఈ రెండు ప్రక్రియలు ఏకకాలంలో సంభవించడం అత్యంత అరుదైన విషయమని, ఇది నైరుతి రుతుపవనాల ఆగమనాన్ని ప్రభావితం చేస్తుందని తెలిపారు.

### సాధారణం కంటే అత్యధిక వర్షం..

సాధారణంగా జూలై నుంచి సెప్టెంబర్ మధ్య నమోదయ్యే అత్యధిక వర్షపాతం ఈసారి అంతకన్నా ముందే నమోదు కావచ్చని అంచనా వేస్తున్నారు. ఇక అరేబియా సముద్రంలో ఏర్పడే అల్పపీడనాలు పశ్చిమ, వాయవ్య భారతంలో ఎక్కువకాలం కొనసాగే అవకాశాలున్నాయని తెలిపారు. దీంతో వర్షపాతం భారీగా ఉంటుందని పేర్కొన్నారు.

### ఎల్ నినో ప్రభావంతో తిప్పలు

భారతదేశం వ్యవసాయాధారిత దేశం. మెజారిటీ ప్రజలు వ్యవసాయంపైనే ఆదారపడి జీవిస్తున్నారు. పంటలు బాగా పండాలంటే సాగు నీరు ఎంతో ముఖ్యం. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురవక వ్యవసాయం అస్తవ్యస్తంగా మారిపోయింది. అయితే లానినోపరిస్థితుల కారణంగా ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వచ్చి దేశ వ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా భగభగ ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో ప్రజలు ఇంట్లో నుంచి బయటికి రావాలంటేనే జంకుతున్నారు. ఎండ తీవ్రతతో పలు ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చే వర్షాకాలంలో ఈ సారైనా వర్షాలు పడతాయో లేదో అని ఆందోళన చెందుతున్న ప్రజలకు ఇది మంచి వార్తే.. ఈ ఏడాది జూన్ రెండో వారం నుంచే విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న రైతులు, సాధారణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లిలో నీటి కష్టాలు... అల్లాడుతున్న జనం...

**-నాలుగేళ్లుగా సొంత ఖర్చులతో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్న కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్**

**-సమస్యను పట్టించుకోని అధికారులు....**



కరీంనగర్, ఏప్రిల్ 12:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరపాలక ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లి కి నీటి కష్టాలు మొదలయ్యాయి. ఇక్కడి ప్రాంతంలో నీళ్ల కోసం జనం అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలోని సరస్వతి నగర్ లో నీటి కష్టాలు అన్ని ఇన్ని కావు. ఐదేళ్లుగా ఇక్కడి ప్రాంత ప్రజలు నీటి అవసరాల కోసం అష్ట కష్టాలు పడుతున్న అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇక్కడి ప్రాంతం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమై నాలుగు సంవత్సరాల పై కాలం కావస్తున్న మున్సిపల్ నీళ్లు అందించిన దాఖలా లు ఇక్కడ లేవు. ప్రధానంగా తీగల గుట్టపల్లి గ్రామపంచాయతీ కరీంన గర్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమై నాలుగు సంవత్సరాలైనా నేటికీ డివిజన్ ప్రజలకు తాగునీరు అందలేని దయనీయ పరిస్థితి ఉంది.ప్రధానంగా డివిజన్లోని సరస్వతి నగర్ త్రాగునీటి సమస్య ఇబ్బందికరంగా మారడంతో కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ గత నాలుగు సంవత్సరాలుగా తన సొంత డబ్బులతో ట్యాంకర్ల ద్వారా ప్రతి వేసవికాలంలో ప్రజలకు మంచినీటినిఅందిస్తున్నారు. తీగల గుట్టపల్లి గ్రామపంచాయతీ గా ఉన్న సమయంలో ఉన్న పైపులైన ద్వారా, పలు బావిల ద్వారా నేటికీ ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో విలీనమైన తీగల గుట్టపల్లిలో 30% ఉన్న సరస్వతి నగర్ ప్రాంతంలో మున్సిపల్ పైప్ లైన్ పనులను పూర్తి చేయలేని పరిస్థితి ఉంది. ఇక్కడి ప్రాంతంలో తాగునీరు అందలేని దయనీయ పరిస్థితి ఉంది. నగరవ్యాప్తంగాగతంలో 24 గంటలు మంచినీటిని ఇస్తామని, నేడు ఒక గంట కూడా తాగునీటిని సక్రమంగా ఇవ్వలేని పరిస్థితికి నగరపాలక సంస్థ వచ్చింది. కరీంనగర్ పట్టణంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీరును అందించడానికి చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ ఈ విషయంలో ఫెయిల్యూర్ అయినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. తీగల గుట్టపల్లి కాకుండా కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాలన్నింటిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాలు కార్పొరేషన్ లో విలీన మై ఐదు సంవత్సరాలు గడిచిన నేటికీ మున్సిపల్ తాగునీరు అందించడానికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నీటి కష్టాలు తీర్చాలని ప్రజలు, కార్పొ రేటర్లు మొత్తుకున్న పెడచెవిన పెడుతు న్నారు. నగరంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలంతా కోరుకుంటున్నారు.

# ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తత..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్‌పై దాడులకు ఇరాన్ సన్నద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం సూచనలు జారీ చేసింది. ఇరాన్, ఇజ్రాయెల్‌కు ప్రయాణించవద్దని భారత పౌరులకు సూచించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు దీనిని పాటించాలని పేర్కొంది. అలాగే ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు సమీపంలోని భారత రాయబార కార్యాలయాలను సంప్రదించాలని, తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరింది. ఇరు దేశాల్లో నివసిస్తున్న భారతీయులు చాలా జాగ్రత్తగా ఉండాలని, అనవసర కదలికలను నియంత్రించాలని సూచించింది.కాగా, ఏప్రిల్ 1న సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ కాన్సులేట్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేసింది. ఇరాన్ అగ్రశ్రేణి ఆర్మీ జనరల్, మరో ఆరుగురు ఇరాన్ సైనిక అధికారులు ఈ దాడిలో మరణించారు. ఈ నేపథ్యంలో ఈ దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్‌పై దాడికి సన్నద్ధమవుతున్నది. దీంతో మిడిల్ ఈస్ట్‌లో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.

# పెట్టుబడిదారులకు ఓటేసి మోసపోవద్దు : కొప్పుల ఈశ్వర్



హైదరాబాద్, ఏప్రిల్ 12:ఎన్నికల సమయంలోనే ప్రజల ముందుకు వచ్చే పెట్టుబడిదారులకు ఓటేసి మోసపోవద్దని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. సింగరేణి కార్మికుడి బిడ్డనైనా తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. 20 ఏండ్ల రాజకీయ జీవితం, మంత్రిగా చేసిన అనుభవంతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జల్లా సుల్తానాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం వాకర్స్‌తో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కూరగాయల మార్కెట్‌కు వెళ్లి వ్యాపారులు, వినియోగదారులను ఓటు అభ్యర్థించారు.

ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పే వలసదారులు, ఎన్నికలు ముగిసిన వెంటనే కన్నెత్తి చూడరని చెప్పారు.

ఈ ప్రాంతానికి తన సేవలు అవసరమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావించి.. తనకు పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని తెలిపారు. ఈ నియోజకవర్గం పూర్తిగా సింగరేణి గనులతో కూడుకున్నదనీ.. తాను సింగరేణిలో 26 ఏళ్లుగా పనిచేసిన కార్మికుడిననీ ఈ ప్రాంతం వారితో తనకు సంబంధాలున్నాయని అన్నారు. పెద్దపల్లి ప్రజలు కారు గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు. చూట్టపు చూపుగా వచ్చే వారికి అవకాశం ఇవ్వొద్దని సూచించారు.

# ఎంపీ రంజిత్ రెడ్డి సమక్షంలో చేవెళ్ల జడ్పీటీసీ కాంగ్రెస్ లో చేరిక..



హైదరాబాద్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. చేవెళ్ల జడ్పీటీసీ మాలతి ఆ పార్టీకి రాజీనామ చేసారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం చేవెళ్లలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసారు.

అంతకు ముందే జడ్పీటీసీ మాలతి ఆ పార్టీకి దూరమయ్యారు. శుక్రవారం చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డి సమక్షంలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ పామేనా భీమ్ భరత్ ఆధ్వర్యంలో.. చేవెళ్ల మండల జడ్పీటీసీ మాలతితో పాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఎం జంగయ్య, పి దయాకర్, ఏం సాయి రెడ్డి ఏ కృష్ణారెడ్డి, తదితరులు రంజిత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు పలుగుట్ట జనార్దన్ రెడ్డి, చేవెళ్ల ఎంపీటీసీ సభ్యులు వసంతం, చేవెళ్ల సర్పంచ్ శైలజ అగ్గి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకటరెడ్డి, ప్రతాపరెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, మండల కార్యదర్శి గుండాల రాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం మల్లన్న హుండీ లెక్కింపు.. 15 రోజుల్లో రూ.3 కోట్లకు పైగానే

శ్రీశైల ఏప్రిల్ 12:జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మల్లన్న ఆలయంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాలు, పరివార ఆలయాల హుండీ లెక్కింపును నిర్వహించారు. చంద్రావతి కల్యాణ మండపంలో ఈ లెక్కింపు నిర్వహించగా శ్రీశైలం మల్లన్న దేవస్థానానికి 3 కోట్ల 87 లక్షల 52 వేల 761 రూపాయల నగదు ఆదాయం వచ్చిందని ఈవో డి.పెద్దిరాజు తెలిపారు.

గత 15 రోజులుగా భక్తులు ఈ ఆదాయాన్ని శ్రీ స్వామి అమ్మవార్లకు కానుకల రూపంలో సమర్పించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. హుండీ లెక్కింపులో నగదుతోపాటు 263 గ్రాముల 900 మిల్లీగ్రాముల బంగారం, 9 కిలోల 700 గ్రాముల వెండి? నగదు బంగారంతో పాటు 44 అమెరికన్ డాలర్లు, 1 ఒమానీ రియాల్, 101 ఖతార్ రియాల్, 1.75 కువైట్ దినార్, 5 యూఏఈ దిర్హామ్ లు, 30 సౌదీ అరేబియా రియాళ్లు, 20 కెనడా డాలర్లు ఇలా వివిధ దేశాల విదేశీ కరెన్సీలు ఈ లెక్కన లభించినట్లు ఆలయ ఈవో పెద్దిరాజు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థానం ఈవో పెద్దిరాజ్ ఆధ్వర్యంలో పటిష్ట నిఘా ఏర్పాటు చేయగా, దేవస్థానంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, శివసేవకులు కౌంటింగ్‌లో పాల్గొన్నారు.

# ఫ్యామిలీ వీసాకు వార్షిక ఆదాయ పరిమితిని 55 శాతానికి పెంపు

**-బ్రిటన్ ప్రభుత్వం కీలక నిర్ణయం**

**-భారతీయ కుటుంబాలకు రిషి సునాక్ ప్రభుత్వం షాక్**





లండన్ ఏప్రిల్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : బ్రిటన్ ప్రభుత్వం కుటుంబ వీసా నిబంధనలను కటుతరం చేసింది. బ్రిటన్‌లో శాశ్వత నివాసం ఏర్పరుచుకున్న వారు భారతీయ సంతతివారైనా ఇతరులైనా తమ కుటుంబ సభ్యులను బ్రిటన్‌కు తీసుకురావడం ఇప్పుడిక సులువు కాదు. ఫ్యామిలీ వీసాకు వార్షిక ఆదాయ పరిమితిని 55 శాతానికి పెంచుతూ బ్రిటన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోకి వలసలను అరికట్టాలనే విధాన నిర్ణయాలలో భాగంగా ఈ నిర్ణయం అమలులోకి తీసుకువచ్చారు. వేతన లేదా ఆదాయ పరిమితి వార్షిక స్థాయి పెంపుదలతో ఇక ఫ్యామిలీవీసాకు దరఖాస్తు చేసుకునే వారి కనీస వార్షిక వేతనం ఇకపై 29000 పౌండ్లు (జిబిపి) ఉండాల్సిందే.

ఇంతకు ముందు ఇది 18,600 పౌండ్లు ఉండేది. ఫ్యామిలీ వీసా వార్షిక వేతన పరిమితిని పెంచాలని రిషి సునాక్ ప్రభుత్వం గత ఏడాదే నిర్ణయించింది. దీనిని స్కిల్డ్ వర్కర్స్ వీసాతో సమానం చేయాలని తలపెట్టారు. కాగా ఈ విషయం ఇప్పుడు ఈ నెల 11వ తేదీ నుంచి అమలులోకి వచ్చిందని అధికార వర్గాలు తెలిపాయి. బ్రిటన్‌లో ఆదాయం స్థాయిని బట్టే ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులను దేశానికి తీసుకురావడం లేదా ఇక్కడ వారికి ఉద్యోగం చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుంది. దేశంలోకి చట్టపరమైన వలసల ప్రక్రియతోనే తలెత్తుతున్న పలు సమస్యల నియంత్రణకు ఇప్పుడు తీసుకున్న నిర్ణయం అత్యంత కీలకమని వెల్లడైంది.

రిషి సునాక్ ప్రభుత్వం తమ దేశంలోని టాక్స్ పేయర్స్‌కు వలసదార్ల వల్ల అదనపు భారం పడకుండా చేసేందుకు సంకల్పించిందని అధికారవర్గాలు తెలిపాయి. సామూహిక వలసలు చట్టబద్ధంగానే జరుగుతున్నాయి. దీనికి సహేతుక పరిష్కారం అవసరం. బ్రిటిషర్లందరికి ఆమోదయోగ్య నిర్ణయం తీసుకోవడానికి ఇటువంటి నిర్ణయం తప్పడం లేదని హోం మంత్రి జేమ్స్ క్లెవర్లీ తెలిపారు. కాగా వచ్చే సంవత్సరం నుంచి వార్షిక వేతన పరిమితిని 38000 పౌండ్లకు పెంచాలని కూడా ముందుగా నిర్ణయించారు.

దీనిపై తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తం కావడంతో ఈ ప్రతిపాదనను సవరించారు. ఇక ఇప్పుడు తీసుకున్న వార్షిక వేతన పరిమితి పెంపుదలతో వలసల సంఖ్య ఏడాదికి కనీసం మూడు లక్షల వరకూ తగ్గుతాయని అధికార వర్గాలు విశ్లేషించాయి. అయితే ఈ క్రమంలో ఈ నిర్ణయ ప్రభావం ఎక్కువగా భారతదేశం నుంచి ఈ ఫ్యామిలీ వీసాలపై వచ్చే వారిపైనే పడుతుంది. బ్రిటన్ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకోవడానికి ప్రత్యేక కారణం ఉంది. 2022లో ఈ ఫ్యామిలీ వీసాల ద్వారా బ్రిటన్‌లోకి చట్టబద్ధంగానే, నిబంధనల పరిధిలోనే ప్రవేశించిన వలసదార్ల సంఖ్య రికార్డు స్థాయిలో 7,45,000కు చేరారు. ఇది దేశ పౌరులకు పలు స్థాయిల్లో ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెట్టింది. దీనితో పలు విషయాలను విశ్లేషించుకుని ఈ నిర్ణయానికి వచ్చారు.

# ఇల్లు కట్టేందుకు తెచ్చుకున్న ఇసుకలో శవం..!

అమరావతి, ఏప్రిల్ 12:ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక మాఫియా ఇష్టారీతన వ్యవహరిస్తోందని రుజువు చేసే మరో ఘటన వెలుగుచూసింది. శ్మశానాలను కూడా వదలకుండా తవ్వేస్తున్నారు. బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెంలో ఇంటి నిర్మాణం కోసం ఇసుక తెప్పించుకుంటే.. అందులో శవం బయటపడింది. ఘటనపై ఆ ఇంటి యజమానురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివరాల్లోకి వెళ్తే.. పద్మనాభంపేటలో నివాసముంటున్న కాగితాల లక్ష్మి నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టారు. బేస్ మట్టం పూడ్చేందుకు స్థానిక వ్యాపారులతో మాట్లాడి ట్రాక్టర్లతో ఇసుక తోలించారు. ఇంటి పని కోసం వచ్చిన కూలీలు బేస్ మట్టాన్ని నింపేందుకు ఇసుక తీస్తుండగా అందులో ఓ వ్యక్తి శవం బయటపడింది. దాంతో భయాందోళనకు గురైన కూలీలు విషయాన్ని ఇంటి యజమానికి తెలియజేశారు.

ఇంటి యజమాని లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇసుకలో బయటపడ్డ మృతదేహాన్ని రెండు రోజుల క్రితం పూడ్చిపెట్టి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. జేసీబీతో ఇసుక తవ్వే క్రమంలో తల ఊడిపోయి ఉంటుందని, అందుకే మొండెం మాత్రమే మిగిలిందని పోలీసులు అనుమానిస్తున్నారు.

చీరాల రూరల్ సీఐ సత్యనారాయణ ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. మృతదేహం ఎక్కడిది..? ఇసుక ఎక్కడ నుంచి తరలించారు..? ఇసుకలో మృతదేహం ఎలా వచ్చింది..? అసలు ఏం జరిగి ఉంటుంది..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# ఆ బాధ్యతలకు రాజీనామా చేసిన మేరీ కోమ్..



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:భారత దిగ్గజ బాక్సర్, మాజీ ప్రపంచ ఛాంపియన్ మేరీకోమ్ కీలక నిర్ణయం తీసుకుంది. పారిస్ ఒలింపిక్స్ నేపథ్యంలో, భారత్ చెఫ్ డి మిషన్ (అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌లో జాతీయ జట్టుకు బాధ్యత వహించే వ్యక్తి) బాధ్యతల నుంచి తప్పుకుంది. పారిస్ ఒలింపిక్స్-2024లో పాల్గొనే భారత జట్టుకు మెంటార్‌గా సేవలందించేందుకు ఒలింపిక్ అసోసియేషన్ మేరీకోమ్‌ను చెఫ్ డి మిషన్‌గా నియమించింది. అయితే తాజాగా మేరీకోమ్ ఆ బాధ్యత నుంచి తప్పుకున్నారు.వ్యక్తిగత కారణాలతో మేరీకోమ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష ధృవీకరించారు. తనను చీఫ్ డి మిషన్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ మేరీకోమ్ లేఖ రాశారని పీటీ ఉష వెల్లడించారు. ఈ నేపథ్యంలో మేరీకోమ్ రాజీనామాను ఆమోదించినట్లు ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష ప్రకటించారు. ఈ నేపథ్యంలో మేరీకోమ్ రాజీనామాను ఆమోదించినట్లు త్వరలోనే ఆమె స్థానంలో కొత్త వ్యక్తిని నియమిస్తామని ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష ప్రకటించారు.''దేశానికి సేవ చేసే ఏ అవకాశాన్నైనా నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తాను. ఈ బాధ్యతను కూడా సమర్థవంతంగా నిర్వర్తించడానికి మానసికంగా సంసిద్ధమయ్యాను. కానీ నా వ్యక్తిగత కారణాల దృష్ట్యా రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నాను. ఇలా చేయడం నాకు అస్సలు ఇష్టం లేదు. కానీ ఇంతకంటే నాకు వేరే మార్గం కనిపించడం లేదు. ఒలింపిక్స్‌లో నా దేశం తరపున ఆడే అథ్లెట్లందరికీ ఎల్లవేళలా మద్దతుగా ఉంటాను'' అని మేరీ కోమ్ పీటీ ఉషకు రాసిన లేఖలో పేర్కొన్నారు. కాగా మణిపూర్‌కు చెందిన మేరీ కోమ్.. ఆరుసార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచారు. 2021 లండన్ ఒలింపిక్స్‌లో ఈ లెజెండరీ బాక్సర్ కాంస్య పతకం కైవసం చేసుకున్నారు.

# మిలియన్ల మంది దీర్ఘకాలిక వ్యాధులతో పోరాడుతున్నారు: సాంకేతికత మరియు వ్యక్తిగతీకరించిన సంరక్షణ ఆశను అందించగలదా?

హైదరాబాద్, ఏప్రిల్ 12:మధుమేహం, ఊబకాయం మరియు ఫ్యాటీ లివర్ వ్యాధి వంటి దీర్ఘకాలిక జీవక్రియ వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా భయంకరమైన రీతిలో పెరుగుతున్నాయి. భారతదేశంలోనే, 100 మిలియన్ల మందికి పైగా ప్రజలు మధుమేహంతో బాధపడుతున్నారు. అదృష్టవశాత్తూ, వ్యక్తిగతీకరించిన సంరక్షణతో పాటుగా సమకాలీకరించబడిన ఆరోగ్య సంరక్షణ సాంకేతికతలలో పురోగతులు చిగురాశను కలిగిస్తున్నా యి.ఇంటర్నేషనల్ దయాబెటిస్ ఫెడరేషన్ చెప్పేదాని ప్రకారం, ప్రపంచ జనాభాలో దాదాపు 11% మందికి మధుమేహం ఉంది, భారతదేశం లో ఈ ప్రభావం చాలా ఎక్కువగా వుంది. ఇది అధిక ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, జీవన నాణ్యతను తగ్గించడం మరియు తీవ్రమైన సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది.నూతన సాంకేతికత - డిజిటల్ ట్విన్స్ - దీర్ఘకాలిక వ్యాధులను ఎదుర్కోవడానికి తోడ్పడుతుంది. మీ ప్రత్యేకమైన జీవక్రియ యొక్క డిజిటల్ ప్రతిరూపాన్ని ఊహించుకోండి. ఇది సంపూర్ణ శరీర డిజిటల్ ట్విన్ చేస్తుంది. ధరించగలిగే సెన్సార్‌లు, రక్త పరీక్షలు మరియు వ్యక్తిగత ప్రాధాన్యతల నుండి 3,000 డేటా పాయింట్‌లను సేకరించడం ద్వారా, ఈ సాంకేతికత ఆరోగ్యానికి వ్యక్తిగతీకరించిన రోడ్‌మ్యాప్‌ను సృష్టిస్తుంది.హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ రవిశంకర్, సంపూర్ణ శరీర డిజిటల్ ట్విన్ యొక్క పరివర్తన సామర్థ్యాన్ని వివరిస్తూ, ''సాంప్రదాయ 'వన్-సైజ్-ఫిట్స్-అల్' విధానం దీర్ఘకాలిక వ్యాధులకు పనిచేయదు. డేటా మరియు అధునాతన సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా డిజిటల్ ట్విన్స్ తో ప్రతి రోగి యొక్క నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన చికిత్స ప్రణాళికలను రూపొందించవచ్చు. ఈ విధానం రోగి ఫలితాలను మరియు జీవన నాణ్యతను గణనీయంగా మెరుగుపరిచే సామర్థ్యాన్ని కలిగి ఉంది...'' అని అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత డయాబెటాలజిస్ట్ డాక్టర్ గంగా కిరణ్ మాట్లాడుతూ, '' సంక్లిష్టతలను నివారించడం మరియు మందుల పై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా, ఈ సాంకేతికత రోగులకు మరియు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు గణనీయమైన రీతిలో ఖర్చును ఆదా చేస్తుంది...'' అని అన్నారు.


## స్వర్ణలక్ష్మణరావు సాహిత్య & సేవా సంస్థ- నిజామాబాద్

తేది: 14-04-2024 ఆదివారం ఉ॥ 10.00గం॥లకు

ఉగాది కవి సమ్మేళనము, జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవం

మరియు

బైస దేవదాసుగారి "ఆలోచనల ఆవిష్కరణ" పుస్తకావిష్కరణ

సభాధ్యక్షులు: గౌ॥ శ్రీ దారం గంగాధర్ గారు (ప్రముఖ కథా రచయిత)

ముఖ్య అతిథి: మరియు పుస్తకావిష్కర్త: గౌ॥ శ్రీ డా॥ నందిని సిధారెడ్డి గారు (తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు)

విశిష్ట అతిథులు: గౌ॥ డా॥ శ్రీ నాళేశ్వరం శంకరం గారు (తెలంగాణ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షులు)
గౌ॥ శ్రీ బైస దేవదాసు గారు (నేటినిజం దినపత్రిక సంపాదకులు)

ప్రత్యేక అతిథులు: గౌ॥ శ్రీ వి.పి. చందన్‌రావు గారు (సభా సామ్రాట్)
గౌ॥ శ్రీ పెందోట వెంకటేశ్వర్లు గారు (బాల సాహిత్య పీఠం అధ్యక్షులు- సిద్దిపేట)

ఆత్మీయ అతిథులు: గౌ॥ శ్రీ కటకం రమేష్‌గారు (టి.ఆర్.టి.ఎఫ్.రాష్ట్ర అధ్యక్షులు)
గౌ॥ శ్రీ కావలి అశోక్ కుమార్‌గారు (టి.ఆర్.టి.ఎఫ్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

వేదిక: విశ్వోదయ టక్నో స్కూల్, ఆర్యనగర్ బ్యాంక్ కాలనీ హైదరాబాద్ రోడ్, నిజామాబాద్.

- స్వర్ణ మమత
వ్యవస్థాపక అధ్యక్షురాలు


# యాత్రికులకు 'ఉలా' ప్రత్యేక రైలు

హైదరాబాద్, ఏప్రిల్ 12: భారతీయ రైల్వేలో భారత్ గౌరవ్ పథకంలో భాగంగా సేవలందించే ప్రైవేట్ రైలు సౌత్ స్టార్ రైలులో ఉలా తమ తదుపరి పర్యటనను ప్రకటించింది. మే 18 నుంచి 29వ తేదీ వరకు అనగా పన్నెండు రోజులు ఈ యాత్ర ఉంటుంది. ఈ రైలు ప్రయాగ్ రాజ్, వారణాసి, గయ, అయోధ్య మీదుగా హరిద్వార్, ఢిల్లీ, మథుర, ఆగ్రాకు చేరుకుంటుంది. భారతదేశంలోని పురాతన సంప్రదాయాలు, దైవత్వంతో నిండిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని సందర్శించడానికి ఇది ఒక అవకాశాన్ని ఇస్తుంది. ఈ ప్రయాణం యాత్రికులకు గొప్ప అనుభూతిని అందిస్తుంది. ఈ ప్రత్యేక రైలు కోయంబత్తూరులో బయలుదేరి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, విజయవాడ, వరంగల్ స్టేషన్లలో ప్రయాణిస్తుంది. ఆయా ప్రాంతాలలో ఉన్న వాళ్లు ప్రయాణం చేసేందుకు వీలు కల్పిస్తుంది. ఈ సందర్భంగా ప్రత్యేక రైలు ప్రొడక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ మాట్లాడుతూ ఈ రైలులో అనేక ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ఈ రైలులో పీఏ సిస్టమ్స్, సీసీటీవీ కెమెరాలు, కోచ్ సెక్యూరిటీ, టూర్ మేనేజర్లు, ట్రావెల్ ఇన్సూరెన్స్, వసతి, సందర్శన, మూడు పూటలా దక్షిణ భారతదేశ భోజనం కలదన్నారు. ఇంకా వివిధ రకాల సౌకర్యాలు కూడా ఉన్నాయన్నారు. యాత్రికులు ఎల్టీసీ, ఎల్ఎఫ్సీ సౌకర్యాన్ని కూడా పొందవచ్చని తెలిపారు. స్లీపర్ (బడ్జెట్) రూ.25,200, స్లీపర్ (ఎకానమీ) రూ.30,500, థర్డ్ ఏసీ (కంఫర్ట్) రూ.37,300, థర్డ్ ఏసీ (డీలక్స్) రూ.48,300 ధరలలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంక్వైరీ, బుకింగ్‌ల కోసం 74167 18800/ 80152 28115 నెంబర్లలో సంప్రదించగలరని తెలిపారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడానికి www.traintour.in సందర్శించాలన్నారు.

# ప్రజాశాంతి పార్టీకి గుర్తు మార్చేసిన ఈసీ.. సొంతంగా కుండ తయారు చేసిన కేఏ పాల్

హైదరాబాద్, ఏప్రిల్ 12:ప్రజాశాంతి పార్టీకి ఎన్నికల కమిషన్ కొత్త గుర్తు కేటాయించింది. ఇన్నాళ్లు ఆ పార్టీకి హెలికాప్టర్ గుర్తు ఉండేది. కానీ రాబోయే ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీకి హెలికాప్టర్ గుర్తును కాకుండా.. మట్టికుండ గుర్తును కేటాయించింది.

ఈ విషయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ స్వయంగా వెల్లడించారు. విశాఖపట్నంలోని రైల్వే న్యూ కాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం కేఏ పాల్ మీడియాతో మాట్లాడారు. మకు కుండ గుర్తు ఇచ్చిన ఈసీకి, ఆ గుర్తు ఇవ్వాలని ఆదేశించిన ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 10వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం తమకు కుండ గుర్తు కేటాయించిందని కేఏ పాల్ మీడియాకు వెల్లడించారు. స్వయంగా ఓ కుండను తయారుచేసుకుని మరీ ప్రెస్‌మీట్‌కు వచ్చి తన గుర్తును చూపించారు.

ప్రతి ఒక్కరూ ఈ కుండ గుర్తును తమ మనసుల్లో నింపుకొని.. జీవితాలను మార్చుకోవాలని అన్నారు. శాంతి పాలన రావాలంటే.. కుండ పాలన రావాలని తెలిపారు. ఫ్యాన్‌కు ఉరివేసుకుని చాలామంది చనిపోయారని.. గ్లాసులు పగిలిపోయి చాలామందికి హాని జరిగిందని.. సైకిళ్లు యాక్సిడెంట్లు అయి వందల వేల మంది చనిపోయారని.. అదే కుండ తన మంచినీటితో కోట్ల మందికి ప్రాణాన్ని ఇచ్చిందంటూ.. రాజకీయ ప్రత్యర్థులపై సెటైర్లు వేశారు. తాను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అందరికీ ఉచిత విద్య, వైద్యం అందిస్తామని.. నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పిస్తామని అన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.